




31వ వసంతంలోకి

# చురకలు

కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్లా

మంగళవారం, అక్టోబర్ 13, 2026 పేజీలు : 8


### బ్రహ్మచారిణి రూపంలో

## అమ్మవారి దర్శనం

**రామ కిష్టయ్య సంగన భట్ల...**

నక్షత్రాలలో మొదటిది అశ్విని కాగా ఆ నక్షత్రమే పూర్ణిమ నాడు ఉండడం వల్ల ఏర్పడిన మాసం ఆశ్వయుజం. అమ్మవారు మహిషుడనే దుష్ట రాక్షసుడిని, అతని అనుచర రక్కసి గణాన్ని సంహరించడమే నేపథ్యంగా దసరా నవరాత్రులు జరుపు కుంటారు. 9రోజులు జరిగిన పోరులో చెడుపై మంచి, దానవత్వంపై దైవత్వం విజయం సాధించగా, అందుకు ప్రతీకగానే నేటికీ అమ్మవారి ఆలయాలలో ఆచారాలు, అలవాట్లను బట్టి రోజుకో రూపంతో అలంకరించి, పదవ రోజు విజయోత్సవ (విజయ దశమి) వేడుకలు జరుపు కుంటారు. దుర్గాదేవి నవ శక్తులలో ద్వితీయ రూపం బ్రహ్మ చారిణిది. బ్రహ్మచారిణి అంటే తపశ్చారిణి. ఆమె రూపం పూర్ణ జ్యోతిర్మయమై, భవ్యమైనది. ఆమె దక్షిణ హస్తంలో జపమాల, వామ హస్తంలో కమండలం ఉంటాయి. అమ్మవారి ఉపాసన వల్ల మానవులలో తపస్త్యాగ వైరాగ్య సదాచార సంయమనాలు వర్ధిల్లుతాయి. జీవితం కఠిన సంఘర్షణ వేళల్లో కూడా సాధకుని మనస్సు విచలితం కాదు. బ్రహ్మచారిణీ దేవివల్ల సాధకునకు సర్వే సర్వదా సిద్ధి, విజయాలు లభిస్తాయి. ఈరోజున సాధకుని మనస్సు స్వాధిష్ఠాన చక్రంలో ఉంటుంది. స్థిర మనస్కుడైన యోగి ఈ తల్లి భక్తిని పొంది, ఈమె కటాక్షానికి పాత్రు డౌతాడు. రెండవ రోజున ధర్మపురి క్షేత్రస్థ రామలింగేశ్వర స్వామి వారి ఆలయం (శివాలయం )లో దసరా(దేవి) -మిగతా 2లో

### ఎల్‌నినో ప్రభావంపై

## ముందస్తు చర్యలు తీసుకోవాలి



-మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో వర్చువల్‌గా సమావేశమైన అధికారులు

-రబీ కార్యాచరణ ప్రణాళికపై చర్చ..

బొప్పాపూర్ రైతు వేదికలో కార్యక్రమం

**చురకలు ప్రతినిధి, ఎల్లారెడ్డిపేట అక్టోబర్ 12 :** రాబోయే రబీ సీజన్‌లో ఎల్‌నినో ప్రభావం వల్ల వ్యవసాయ రంగానికి ఎదురయ్యే సవాళ్లను ముందుగానే అంచనా వేసి, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టాలని ఉద్దేశంతో సోమవారం రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్ రైతు వేదికలో వర్చువల్ సమావేశం నిర్వ హించారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో వర్చు వల్ విధానంలో సమావేశమైన అధికా రులు, ఎల్‌నినో ప్రభావానికి -మిగతా 2లో

# పచ్చ నోట్లిస్తేనే పత్రం...

-అవసరాన్ని బట్టి వసూళ్లు

ఫ్యామిలీ మెంబెర్స్



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, అక్టోబర్ 12:** జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లోని రెవెన్యూ కార్యాలయాల్లో కొందరు అధికారుల తీరుతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పలు మండలాల్లోని రెవెన్యూ కార్యాలయాల్లో ఇష్టానుసారంగా పని చేస్తున్నారు. దరఖాస్తుదారులను నెలల తరబడి కార్యాలయాల చుట్టూ తిప్పుకుంటున్నారనే విమర్శలున్నాయి. కాసులిస్తేనే ధృవపత్రాలు ఇస్తామనే దందా పెరుగుతోంది. ముఖ్యంగా కుటుంబసభ్యుల ధృవపత్రం(ఫ్యామిలీ మెంబర్స్ సర్టిఫికేట్) కావాలంటే రెవెన్యూ అధికారులు దళారుల ద్వారా కొందరు, గిర్దావర్ ల ద్వారా, జిపివోల ద్వారా మరికొందరు నేరుగా ఇంకొందరు అక్రమంగా వసూళ్లకు పాల్పడుతున్నారు. ఇవ్వమంటే కోర్టు కెళ్లి తెచ్చుకొని దబాయిస్తున్నారనే ఆరోపణలున్నాయి.

**ఇక్కడే నుంచే మొదలు..**

పత్రం కోసం మీసేవ పోర్టల్లో నింబంధనల ప్రకారం జివిస్టి ఖర్చులతో కలిపి రూ.80 రుసుముతో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. కాని రూ.200 నుంచి 500 వరకు గరిష్టంగా వసూలు చేస్తున్నారు. ఇక్కడ నుంచి మొదలయ్యే అదనపు కాసుల బాదుడు చివరకు ధృవపత్రం చేతికందేవరకు ఎంత ఖర్చువుతుందో చెప్పలేని పరిస్థితులుంటున్నాయి. రెవెన్యూ కార్యాలయంలో నేరుగా దరఖాస్తు చేసుకుంటే చేయి తడిపితే మ్యానువల్గా కూడా జారీ చేస్తున్నారు. కుటుంబ పెద్ద మరణిస్తే నామినీ సభ్యులకు రావాల్సి భీమా సొమ్ము, వ్యక్తిగత బ్యాంకు ఖాతాలోని నిల్వ డబ్బులు, లాకర్లో పొందుపర్చిన డబ్బులు, వారసత్వ భూముల పట్టామార్పిడి, పిఎఫ్ డబ్బులు రావాలంటే కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగాలు పొందాలన్నా ఖచ్చితంగా కుటుంబసభ్యులు ధృవపత్రం అవసరం ఉంటుంది.

**అవసరాన్ని బట్టి వసూళ్లు...**

దరఖాస్తు ఫారంలో వివరాలు నింపి మీ సేవ కేంద్రంలో దరఖాస్తు చేసుకున్న తర్వాత నోటరీ అఫిడవిట్ చేయించాలి. ఇక్కడ నోటరీ కోసం దళారులు,టైపు ఇన్స్టిట్యూట్ వద్ద తిష్ట వేసుకొని సంబంధిత నోటరీ కోసం రూ.500లు మొదలుకొని రూ.5వేల వరకు వసూలు చేస్తున్నారు. సంబంధిత గిర్ధావర్లు క్షేత్ర పరిశీలన చేయాల్సి ఉండగా ఆర్జీదారులు ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగుల ధృవీకరణ పూచీకత్తు ఇస్తేనే ధృవీకరిస్తామని చెబుతుండగా, ఆర్జీదారులు ప్రభుత్వ ఉద్యోగుల ధృవకరణ పూచీకత్తు కోసం ముప్పుతిప్పలు పడాల్సి వస్తుంది. దీనికి తోడు కుటుంబసభ్యుల అందరి ఆధార్ కార్డులు, రేషన్ కార్డుల జిరాక్స్ పత్రాలు పొందుపర్చాలంటున్నారు. ఈ క్రమంలోనే అసలు దందా ప్రారంభమవుతుంది. భీమా డబ్బులు రూ.కోట్లలో ఉంటే ఒక పెద్ద రేటు, రూ.లక్షల్లో ఉంటే మరో రేటు, భూములు ఎకరాల్లో ఉంటే ఓ రేటు, గుంటల్లో ఉంటే ఆస్థాయికి తగ్గ రేటు కొందరు అధికారులు డైరెక్టుగా, మరికొందరు క్షేత్రస్థాయి సిబ్బందిచే అక్రమంగా విధిస్తున్నారు. కొన్ని చోట్ల ఒక వ్యక్తి ఇద్దరు భార్యలు, సంతానం ఎక్కువ ఉన్న చోట ఆయా రెవెన్యూ అధికారి, సిబ్బందికి కాసుల వర్షమే కురుస్తుంది. కుటుంబసభ్యుల మధ్య గొడవలు, వాగ్వాదాలుంటే ఈ అధికారులు పైసల పండుగ చేసుకుంటున్నారు. ఇద్దరు భార్యల వద్ద వేర్వేరుగా వసూళ్లు చేసుకొని వేర్వేరుగా సర్టిఫికేట్లు ఇస్తున్నట్లుగా సమాచారం. గరిష్ఠంగా రూ.లక్షకు తగ్గకుండా ధృవపత్రం కోసం లంచం డిమాండ్ చేస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాలోని ఓ అర్బన్ మండల పరిధిలో రూ.50లక్షలు భీమా చేసిన కొడుకు చనిపోతే మొదటగా తండ్రి వద్ద రూ.1లక్ష ఆ అధికారి నేరుగా పొందగా, ఆ తండ్రితో విబేధాలు ఉన్న కోడలు తనకే ఆ పత్రం ఇవ్వాలని అధికారికి రూ.2లక్షలు ఇవ్వగా తాను జారీ చేసిన ఆ కోడలుకు ఇవ్వాలని ఆ తండ్రిని బెదిరించినట్లు తెలిసింది. సదరు కొడలుకు సైతం మరో పత్రం ఇచ్చినట్లు తెలిసింది. మరో మండల పరిధిలో భూములున్న తండ్రి చనిపోతే కుటుంబసభ్యుల ధృవపత్రం కోసం దరఖాస్తు చేసుకుంటే రెండు నెలలు దాటుతున్నా ఇవ్వడం లేదని కిందిస్థాయి అధికారిరిని అడిగితే లక్ష రూపాయాలు డిమాండ్ చేయడం గమనార్హం. కొన్ని మండలాల్లో అన్ని వివరాలు సమర్పించినా, ప్రజాప్రతినిధులతో చెప్పించినా పచ్చ నోట్లిస్తేనే పత్రం అందినట్లు పలువురు వాపోయారు.





## ఇబ్రహీంపట్నంలో ప్రజావాణి కార్యక్రమం



**చురకలు విలేకరి ఇబ్రహీంపట్నం : అక్టోబర్ (12):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సమస్యలను స్థానిక స్థాయిలో త్వరితగతిన పరిష్కరించేందుకు చేపట్టిన మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమం సోమవారం జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరిగింది ఈ కార్యక్రమంలో ఒక్క దరఖాస్తు రెవెన్యూ శాఖకు సంబంధించినది కావడంతో సంబంధిత అధికారులకు పంపించారు. వినతిని త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఇబ్రహింపట్నం ఎంపీడీఓ సీహెచ్ గణేష్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రోళ్లవాగు నుండి పొలాలకు నీటి విడుదల



**చురకలు విలేకరి, బీర్ పూర్, అక్టోబర్ 12:** బీర్ పూర్ గ్రామంలోని రోళ్లవాగు ప్రాజెక్టు నుండి పంట పొలాలకు సోమవారం నీటిని విడుదల చేశారు. రైతుల కోరిక మేరకు గ్రామ సర్పంచ్ ఎనుమట్ల హరీష్ రైతులతో కలిసి రోళ్లవాగు నుండి నీటిని విడుదల చేశారు. ఖరీఫ్ పంటలకు నీరు అందడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ జతేందర్, వార్డు సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపిక



**చురకలు విలేకరి, జగిత్యాల, అక్టోబర్ 12:** జగిత్యాల పట్టణంలోని దారుల్ హసనాత్ పబ్లిక్ స్కూల్లో ఎనిమిదో తరగతి చదువుతున్న సయ్యద్ ఇస్మాయిల్ ఉద్దీన్ బాక్సింగ్ క్రీడలో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. చిన్న వయస్సులోనే క్రీడారంగంలో ప్రతిభ చాటుతూ రాష్ట్ర స్థాయికి చేరుకోవడంతో పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఈ నెల 10న జగిత్యాల పట్టణంలోని పొన్నాల గార్డెన్‌లో నిర్వహించిన 70వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ 2026--27 ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి టోర్నమెంట్ కమ్ సెలెక్షన్స్‌లో భాగంగా అండర్-14, అండర్-17 బాలబాలికల విభాగాల్లో కరాటే, బాక్సింగ్, తైక్వాండో పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పాల్గొన్న సయ్యద్ ఇస్మాయిల్ ఉద్దీన్ బాక్సింగ్‌లో తన నైపుణ్యాన్ని ప్రదర్శించి రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించాడు. సయ్యద్ కమల్ పాషా కుమారుడైన ఇస్మాయిల్ ఉద్దీన్ సాధించిన ఈ విజయం పాఠశాలకు, కుటుంబ సభ్యులకు గర్వకారణంగా నిలిచింది. ఈ సందర్భంగా పలువురు ఆయనను అభినందిస్తూ, రానున్న రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ విజయాలు సాధించి జగిత్యాల జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

## బ్రహ్మచారిణి, గాయత్రి దేవి అలంకారాల్లో దర్శనమిచ్చిన అమ్మవారు



**ఇబ్రహీంపట్నం : అక్టోబర్ 12 (చురకలు):** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని వేములకుర్తి, బర్దిపూర్, ములరాంపూర్, గోదూర్, తిమ్మాపూర్, ఇబ్రహీంపట్నం, డబ్బా, యామాపూర్, ఎర్దండి, ఫకీర్ కొండాపూర్, వర్షకొండ, అమ్మకపేట, కోమటికొండాపూర్, కేశాపూర్, కోజన్ కొత్తూరు గ్రామాల్లో ఉత్సవాల సందర్భంగా ఆధ్యాత్మిక సందడి నెలకొంది. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు అమ్మవారిని బ్రహ్మచారిణి, గాయత్రి దేవి అలంకారాల్లో అలంకరించి భక్తులకు దర్శనమిచ్చారు. ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన అమ్మవారి మండపాల్లో అర్చకులు వేదమంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు, పంచామృత అభిషేకాలు, అష్టోత్తర పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఉదయం నుంచే భక్తులు కుటుంబ సమేతంగా అమ్మవారి మండపాలకు చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు కుంకుమార్చనలు చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. పలువురు భవానీ దీక్ష భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అమ్మవారి నామస్మరణతో ఆయా గ్రామాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. తొమ్మిది రోజులపాటు నిర్వహించే దేవి శరన్నవరాత్రి ఉత్సవాలను విజయవంతంగా కొనసాగించేందుకు ఆయా గ్రామాల ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేపట్టారు. ఈ కార్యక్రమాల్లో కమిటీ సభ్యులు, మహిళలు, గ్రామస్థులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వైభవంగా వెంకటేశ్వర స్వామి పల్లకి సేవ



**చురకలు విలేకరి ఇబ్రహీంపట్నం : అక్టోబర్ (12):** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని గోదూర్, తిమ్మాపూర్, యామాపూర్, వేములకుర్తి, వర్షకొండ, ఇబ్రహీంపట్నం గ్రామాల్లో శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా విజయదశమికి ముందు నిర్వహించే స్వామివారి పల్లకి సేవలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. సోమవారం రెండో రోజు ఆయా గ్రామాల్లో ఆలయ కమిటీల ఆధ్వర్యంలో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో కొలువుదీర్చి, అర్చకుల వేదమంత్రోచ్చారణల నడుమ మాడవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్య, చంద్ర వాహనాలపై స్వామివారి దర్శనం భక్తులకు ఆధ్యాత్మిక ఆనందాన్ని అందించింది. భక్తులు స్వామివారికి మంగళహారతులు సమర్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి సేవలతో గ్రామాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న బతుకమ్మ సంబరాలు



**ఇబ్రహీంపట్నం : అక్టోబర్ 12 (ఆంధ్రప్రభ):** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ సంబరాలు జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలో గోదుర్, తిమ్మాపుర్, తిమ్మాపుర్ తండ, యామపుర్, ఫకిర్ కోండపుర్, ఇబ్రహీంపట్నం, వేములకుర్తి, బర్దిపూర్, ములరాంపూర్, ఎర్దండి, కోమటికోండాపుర్, వర్షకొండ, డబ్బా, అమ్మక్కపేట, డబ్బ, కేశాపూర్, కొజన్ కొత్తూర్, ఎర్రపుర్ గ్రామాల్లో మహిళలు బతుకమ్మలను రంగురంగుల పూలతో అందంగా పేర్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాంప్రదాయ దుస్తులు ధరించిన మహిళలు, యువతులు బతుకమ్మల చుట్టూ చేరి ఆటపాటలతో సందడి చేశారు. బతుకమ్మ పాటలు పాడుతూ ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొనగా, తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయత, ఐక్యత, సంస్కృతి సంప్రదాయాలు ఈ వేడుకల్లో ప్రతిబింబించాయి. రానున్న రోజుల్లో బతుకమ్మ సంబరాలు మరింత వైభవంగా నిర్వహించేందుకు మహిళలు సిద్ధమవుతున్నారు. ఈకార్యక్రమంలో మహిళలు, చిన్నరులు తదితరులు పాల్గొన్నారు.

## రైతులు ఆరుతడి పంటలపై దృష్టి పెట్టాలి



**చురకలు విలేకరి, మెట్ పల్లి, అక్టోబర్ 12 :** ఎల్ నినో పరిస్థితుల నేపథ్యంలో రైతులు వరి పంటకు బదులుగా ఆరుతడి పంటల సాగుపై మొగ్గు చూపాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచించారు. మెట్ పల్లి మండలం చౌలమద్ది రైతు వేదికలో ప్రత్యేక రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా యాసంగి సీజన్ సాగు, ఎల్ నినో ప్రభావం, వాతావరణ పరిస్థితులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులు, రైతులకు దిశానిర్దేశం చేశారు. యాసంగిలో నీటి వనరులను పొదుపుగా వాడుకోవాలని, మొక్కజొన్న, శనగలు, పెసలు, మినుములు, నువ్వులు, వేరుశనగ వంటి తక్కువ నీరు అవసరమయ్యే పంటలు సాగు చేయాలని సూచించారు. యాసంగికి అనువైన పప్పుధాన్యాలు, నూనెగింజలు, కూరగాయల పంటలు, వాటికి అనుకూలమైన విత్తన రకాల గురించి అధికారులు వివరించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కూన గోవర్ధన్, కోరుట్ల ఏడీఏ రమేష్, మండల వ్యవసాయ అధికారి ఏ.దీపిక, వ్యవసాయ విస్తరణ అధికారులు నరేష్, శేఖర్, మమత, పద్మావతి, రైతులు పాల్గొన్నారు.

## అటవీ శాఖ అధికారులకు జింక అప్పగింత



**చురకలు విలేకరి, బీర్ పూర్, అక్టోబర్ 12:** బీర్ పూర్ గ్రామానికి చెందిన మాటేటి రాజన్నకు చెందిన మేకల మందతో కలిసి వచ్చిన జింకను అటవీ శాఖ అధికారులకు అప్పగించారు. మేకలతో పాటు జింక రావడాన్ని గమనించిన రాజన్న ఈ విషయాన్ని గ్రామ సర్పంచ్ ఎనుమట్ల హరీష్ కు తెలిపాడు. దీంతో సర్పంచ్ హరీష్ తో కలిసి సోమవారం అటవీ శాఖ అధికారులకు జింకను అప్పగించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఎస్ఓలు చంద్రారెడ్డి, ప్రకాష్, ఎఫ్బీఓలు ఆనంద్ రావు, నవీన్, జూనియర్ అసిస్టెంట్ గోపీనాథ్ రెడ్డి, ఎఫ్బీఓ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## దొంగతనం కేసులో నిందితుడికి జైలుశిక్ష

చురకలు ప్రతినిధి, జగిత్యాల, అక్టోబర్ 12: జగిత్యాల పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని నల్ల పోచమ్మ ఆలయం, దాస ఆంజనేయ స్వామి దేవాలయంలో దొంగతనానికి పాల్పడిన కేసులో నిందితుడికి జగిత్యాల జిల్లా కోర్టు జైలు శిక్ష విధించింది. 2025లో జగిత్యాల పట్టణంలోని నల్ల పోచమ్మ ఆలయం, దాస ఆంజనేయ స్వామి దేవాలయంలో గుర్తుతెలియని వ్యక్తి తాళాలు పగలగొట్టి బంగారు, వెండి వస్తువులను దొంగిలించినట్లు ఆలయ నిర్వాహకులు జగిత్యాల టౌన్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. ఈ కేసును అప్పటి ఎస్ఐ మన్మథరావు తన సిబ్బందితో కలిసి విచారించి, దొంగతనానికి పాల్పడిన ఉబోధి శేఖర్ (22) ను గుర్తించి అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. నిందితుడు నేరాన్ని అంగీకరించగా, ఈ కేసును విచారించిన జగిత్యాల ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి రత్న పద్మావతి నిందితుడు ఉబోధి శేఖర్ కు 17 నెలల 15 రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

## విద్యుదాఘాతంతో ఉపసర్పంచ్ ఇల్లుదగ్ధం

**-పరామర్శించిన మాజీ మంత్రి కొప్పుల**



**చురకలు, విలేఖరి, వెల్గటూర్, అక్టోబర్ 12.:** జగిత్యాల జిల్లా ఎండపల్లి మండల కేంద్రం ఉపసర్పంచ్ దాసరి కళ్యాణి నివాస గృహం సోమవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల మంటలు చెలరేగి ఇల్లు, ఇంట్లోని విలువైన సామాగ్రి దగ్ధం కావడంతో విషయం తెలిసిన మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ సంఘటన స్థలానికి వెళ్లి కాలినఇంటినిపరిశీలించారు. కుటుంబాన్ని పరామర్శించి, సంఘటనకు సంబంధించిన వివరాలు తెలుసుకున్నారు. మాజీ మంత్రితో పాటు మండల బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



# రోళ్లవాగు ప్రాజెక్టులోకి నీరు విడుదల చేయాలి

**-ఎస్సారెస్పీ చీఫ్ ఇంజనీర్ కు మాజీ మంత్రులు జీవన్ రెడ్డి, కొప్పుల ఈశ్వర్ లేఖ**



**చురకలు విలేకరి, బీర్ పూర్, అక్టోబర్ 12:** ఖరీఫ్ పంటలను కాపాడేందుకు రోళ్లవాగు ప్రాజెక్టులోకి నీటిని విడుదల చేయాలని కోరుతూ సోమవారం బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి టి.జీవన్ రెడ్డి, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఎస్సారె-స్పీ చీఫ్ ఇంజనీర్ కు లేఖ రాశారు. ఎస్సారెస్పీ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ అయిన రోళ్లవాగు ప్రాజెక్టులో ప్రస్తుతమున్న 0.25 టీఎంసీ నిలువ సామర్థ్యాన్ని 1.00 టీఎంసీకి పెంచే అధీకరణ కార్యక్రమం చేపట్టారని, అందులో భాగంగా రిజర్వ్ ఫారెస్ట్ అనుమతుల కోసం జాప్యం జరుగుతోందని, కనీసం ఉన్న 0.25 టీఎంసీ నీటి నిలువకు కూడా స్లూయిస్ షట్టర్లు తీయకపోవడంతో గత ఏడాది కాలంగా జాప్యం అవుతోందని తెలిపారు. జూలై, ఆగస్టు నెలల్లో కురిసిన వర్షపు నీటిని నిలువ చేసుకోకపోవడంతో ప్రస్తుతం ఖరీఫ్ పంటలకు సంబంధించి బీర్ పూర్, కొంత మేరకు ధర్మపురి మండల రైతాంగం ఆందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు. ఈ నెల మొదటి వారంలో రొల్లవాగు మెయిన్ షట్టర్లు తీయించడం వల్ల కనీసం 0.25 టీఎంసీ నీటిని నిలువ చేసుకోగలిగినా, ఖరీఫ్ పంటలను కాపాడుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రధానంగా జగిత్యాల జిల్లా రైతాంగం కోసం కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ నీటి పారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డిని కలవడంతో, ఎస్సారెస్పీ నీటిని కాకతీయ కాలువ ద్వారా 10 రోజుల పాటు విడుదల చేస్తామని చెప్పారని గుర్తు చేశారు. అత్యవసరంగా పంటలను కాపాడేందుకు విడుదల చేయబోయే నీటిని ప్రధానంగా బీర్ పూర్, ధర్మపురి రైతులకు ఉపకరించేలా డి-53-12ఎల్ డిస్ట్రిబ్యూటరీ ద్వారా రొల్లవాగు ప్రాజెక్టులోని స్లూయిస్ గేట్లు తీయించి, 0.25 టీఎంసీ నింపగలిగితే రైతుల పంటలు కాపాడిన వారమవుతామని, కాకతీయ కాలువ ద్వారా విడుదలయ్యే నీటిని డి-53-12ఎల్ ద్వారా రొల్లవాగు ప్రాజెక్టు 0.25 టీఎంసీ వరకు నింపే విధంగా చర్యలు చేపట్టాలని లేఖలో కోరారు.

### 220 కేవీ కథలాపూర్ సబ్ స్టేషన్

# నిర్మాణ పనులను వేగవంతం చేయాలి

**టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి**



చురకలు ప్రతినిధి, జగిత్యాల, అక్టోబర్ 12: 220 కేవీ కథలాపూర్ సబ్ స్టేషన్ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం జగిత్యాల జిల్లా పరిధిలో నిర్మాణంలో ఉన్న 220 కేవీ కథలాపూర్ సబ్ స్టేషన్ పనులను టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి క్షేత్రస్థాయిలో పరిశీలించి, పనుల పురోగతిని సమీక్షించారు. 132 కేవీ కోరుట్ల సబ్ స్టేషన్ ను తనిఖీ చేసి విద్యుత్ సరఫరా పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా 220 కేవీ కథలాపూర్ సబ్ స్టేషన్ నిర్మాణ పనులను వేగవంతం చేసి, 2027 జనవరి 10వ తేదీ నాటికి పనులు పూర్తిచేసి విద్యుత్ సరఫరాకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత ట్రాన్స్కో అధికారులను, కాంట్రాక్టర్ను సీఎండీ ఆదేశించారు. పనుల్లో జాప్యం జరగకుండా అదనపు కార్మికులను నియమించుకొని, నిర్దేశించిన లక్ష్యాల ప్రకారం పనులు పూర్తి చేయాలని సూచించారు. రాబోయే సీజన్ లో విద్యుత్ డిమాండ్ పెరిగే అవకాశాలను దృష్టిలో ఉంచుకొని, ముందస్తు ప్రణాళికతో విద్యుత్ వ్యవస్థను బలోపేతం చేయాలని ఆయన పేర్కొన్నారు. నిర్మాణ పనుల్లో జాప్యం కారణంగా రైతులు, వినియోగదారులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా అవసర మైన చర్యలు చేపట్టి, నాణ్యమైన, నమ్మకమైన విద్యుత్ సరఫరా అందించాలని అధికారులకు సూచించారు. క్షేత్రస్థాయిలో కాలిపోయిన పంపిణీ ట్రాన్స్ ఫార్మర్లను త్వరితగతిన మార్చాలని, రైతులకు అదనపు మోటార్ల వినియోగం వల్ల కలిగే సమస్యలపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. విద్యుత్ను పొదుపుగా వినియోగించుకునేలా వినియోగదారులకు సూచనలు చేయాలని తెలిపారు. ఈ తనిఖీలో ట్రాన్స్కో కన్స్ట్రక్షన్ డీఈ హనుమయ్య, ట్రాన్స్ కో డీఈ సంపత్, జగిత్యాల డీఈ గంగారం, మెట్ పల్లి డీఈ మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

# బ్రహ్మచారిణి రూపంలో అమ్మవారి దర్శనం



**చురకలు విలేకరి, ధర్మపురి, అక్టోబర్ 12:** ధర్మపురి పట్టణంలో దసరా శరన్న దుర్గ నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. శ్రీలక్ష్మీ నరసింహ స్వామి అనుబంధ ఆలయం శ్రీ రామలింగేశ్వర ఆలయంలో, నూతన టిటిడి కళ్యాణ మండపంలో నవదుర్గ సేవ సమితి ఆధ్వర్యంలో, మార్కెట్ లో ఏర్పాటు చేసిన మహాశక్తి సేవలో సోమవారం రోజున రెండవరోజు అమ్మవారిని శైలపుత్రి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు చేశారు. వేద పండితులు పాలేపు ప్రవీణ్ శర్మ, కాసర్ల వంశీ కృష్ణ శర్మ నారంభట్ల ప్రశాంత్ శర్మ, కసోజ్జుల బాలకృష్ణ శర్మచే ఉదయం చతుష్షష్టి పూజ, తీర్థప్రసాద వితరణ సాయంత్రం విశేష పూజ, నీరాజనం, మంత్రపుష్పం, నామ సంకీర్తన, దేవి భాగవత పురాణ ప్రవచనం, తీర్థప్రసాద వితరణ, తో ఘనం పూజలు నిర్వహించారు. భక్తులు, పుర ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మ వారిని దర్శించుకున్నారు.

# మసీద్-ఎ-హజారీ కమిటీ నియామకం



**చురకలు విలేకరి, జగిత్యాల, అక్టోబర్ 12:** జగిత్యాల జిల్లా కేంద్రంలోని హజారి మహల్లాలో ఉన్న అషూర్ ఖానా, మసీద్-ఎ-హజారీల నిర్వహణకు మేనేజింగ్ కమిటీని నియమిస్తూ ఆదివారం తెలంగాణ రాష్ట్ర వక్ఫ్ బోర్డు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ జనాబ్ మహ్మద్ అసదుల్లా ఉత్తర్వులు జారీ చేశారు. తెలంగాణ వక్ఫ్ బోర్డు ప్రొసీడింగ్స్ నెం. ప్రకారం మహ్మద్ అబ్దుల్ మోహ్సిన్ దరఖాస్తు మేరకు, వక్ఫ్ ఇన్స్పెక్టర్ ఆడిటర్, సర్వేయర్ నివేదిక ఆధారంగా, చైర్మన్ ఆదేశాలతో ఈ కమిటీని ఏర్పాటు చేశారు. వక్ఫ్ చట్టం 1995 సెక్షన్ 18 ప్రకారం ఏడాది కాలానికి (బోర్డు రాటిఫికేషన్ కు లోబడి) ఈ కమిటీని నియమించారు. 6 నెలల్లోగా అషూర్ ఖానాను పునరుద్ధరించాలని ఆదేశించారు. కాగా మహ్మద్ అబ్దుల్ మోహ్సిన్ ను అధ్యక్షులుగా, ఖాజా తాజుద్దీన్ ను ఉపాధ్యక్షులుగా, షేక్ అర్షద్ హుస్సేన్ ను కార్యదర్శిగా, మహ్మద్ అబ్దుల్ మాలిక్ ముకర్రం ను ప్రధాన కార్యదర్శిగా, , మహ్మద్ ఖిజర్ ను కోశాధికారిగా నియమించారు. అషూర్ ఖానాతో పాటు దానికి అనుబంధంగా ఉన్న మసీదును కూడా కమిటీ నిర్వహించాలని, వక్ఫ్ రెగ్యులేషన్స్ 2009 ప్రకారం విధులు నిర్వర్తించాలని, ఉల్లంఘిస్తే వక్ఫ్ చట్టం 1995 సెక్షన్ 67 కింద చర్యలు ఉంటాయని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

# రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలి



**చురకలు ప్రతినిధి కోరుట్ల, అక్టోబర్ 12:** నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ (ఎన్పీడీసీఎల్) చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ (సీఎండీ) కర్నాటి వరుణ్ రెడ్డి ఐఏఎస్ సోమవారం కోరుట్ల పట్టణంలోని 132/33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ రంగానికి అందిస్తున్న త్రీఫేజ్ విద్యుత్ సరఫరా తీరును పరిశీలించారు. 33 కేవీ ఫీడర్లపై విద్యుత్ లోడ్ పరిస్థితులను సమీక్షించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. రైతులకు నాణ్యమైన, అంతరాయం లేని త్రీఫేజ్ విద్యుత్ సరఫరా అందించేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ తనిఖీలో మెట్‌పల్లి డివిజనల్ ఇంజనీర్ మధుసూదన్, జగిత్యాల డివిజనల్ ఇంజనీర్ (టెక్నికల్) గంగారాం, ట్రాన్స్‌కో డివిజనల్ ఇంజనీర్ సంపత్ కుమార్, కోరుట్ల పట్టణ ఏడీఈ భూమేశ్వర్, ఏఈ శ్యామ్‌తో పాటు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రేమించి మొఖం చాటేసిన ప్రియుడు



**చురకలు, విలేఖరి, వెల్గటూర్, అక్టోబర్ 12 :** జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం కిషన్ రావుపేటకు చెందిన ముచ్చర్ల నవీన్ అనే యువకుడు అదే గ్రామానికి చెందిన ఓ మైనర్ బాలికను ప్రేమించి పెళ్లిచేసు కుంటానని నమ్మబలికి, పెళ్లిచేసు కోవాలని నిలదీయడంతో ప్రియుడు మొఖంచాటేసి మోసంచేయ డంతో సోమవారం ఉదయం బాలిక ప్రియుడి ఇంటిముందు బైటాయించి తనకు న్యాయం చేయాలని కోరుతుంది. గత కొంతకాలంగా వీరిమధ్య ప్రేమాయణం కొనసాగు తున్నట్లు తెలిసింది. అయితే బాలిక మైనరని, గర్భందాల్చినట్లు విశ్వసనీయ సమాచారం. ప్రియురాలు ఇంటిముందు బైటాయించడంతో ప్రియుడు ఇల్లువదిలి పారిపోయినట్లు తెలిసింది.

# అభివృద్ధిపై చర్చకు సిద్ధమా..?

## బీఆర్ఎస్ విమర్శలను తిప్పికొట్టిన కాంగ్రెస్ నేతలు



**చురకలు విలేకరి, జగిత్యాల, అక్టోబర్ 12:** బీఆర్ఎస్ దశాబ్ది ఉత్సవాల పేరుతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ పై చేసిన విమర్శలను కాంగ్రెస్ నేతలు తీవ్రంగా ఖండించారు. సోమవారం జగిత్యాల ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ దినేష్, మున్సిపల్ చైర్ పర్సన్ వాణి శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్ నారాయణ రెడ్డి తదితరులు మాట్లాడారు. అభివృద్ధిపై చర్చించకుండా వ్యక్తిగత విమర్శలకు దిగడం సరికాదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక జగిత్యాలలో అనేక అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. డబుల్ బెడ్ రూం ఇళ్ల కోసం మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని తీసుకొచ్చి రూ.30 కోట్లు మంజూరు చేయించారని, మెడికల్ కాలేజీకి నిధులు, రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ పాఠశాల, మాతా శిశు సంరక్షణ, క్రిటికల్ కేర్ ఆసుపత్రి నిర్మాణాలు ఎమ్మెల్యే సంజయ్ కృషితోనే జరుగుతున్నాయన్నారు. బీఆర్ఎస్ నేతలు సారా కోసం నృత్యాలు చేస్తూ అధికారంలోకి రావాలనుకోవడం హాస్యాస్పదమని, భూకబ్జాలు, ఫైవ్ స్టార్ హోటళ్ల కోసమా అధికారం కావాలని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని, కేసీఆర్ ఫామ్ హౌస్ కే పరిమితమయ్యారని విమర్శించారు. 4000 పాఠశాలలు మూతపడ్డాయన్న బీఆర్ఎస్ ఆరోపణలకు ఆధారాలు చూపాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పీసీసీ సెక్రటరీ బండ శంకర్, పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ గట్టు సతీష్, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ గిరి నాగభూషణం, దుమాల రాజ్ కుమార్, కౌన్సిలర్ కూతురు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## పంటల పై రైతులకు అవగాహన



**చురకలు విలేకరి, ధర్మపురి, అక్టోబర్ 12 :** మండలంలోని నాగరం గ్రామంలో తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం, జగిత్యాల మరియు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఎల్నినో ప్రభావం, యాసంగి లో సాగు చేయాల్సిన ఆరుతడి పంటలపై సోమవారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రైతు విజ్ఞాన కేంద్రం జగిత్యాల కోఆర్డినేటర్ డా. తిరుపతి మాట్లాడుతూ ప్రస్తుతం ఈ సంవత్సరం ఎల్నినో ప్రభావం తో రాష్ట్ర వ్యాప్తంగా తక్కువ వర్షపాతం నమోదావడం తో పాటు, భూగర్భ జలాలు కూడా తగ్గిపోతూ ఉందని, ఈ పరిస్థితుల్లో రైతుకు ప్రభుత్వం ఆదేశాల ప్రకారం ఆరుతడి పంటలు సాగు చేయాలని, మన ప్రాంతానికి అనువైన ఆరుతడి పంటలు వాటి సాగు గురించి వివరించారు. వ్యవసాయ విస్తరణ అధికారి, గ్రామ సర్పంచ్ చిలుముల లక్ష్మణ్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో నీటి ఎద్దడి పరిస్థితులకు అనుగుణంగా రైతులు ఆరుతడి పంటలను సాగు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, రైతులు పాల్గొన్నారు.

## అనారోగ్యంతో ఉన్న విలేకరికి ఆర్థిక సహాయం




**చురకలు విలేకరి, మెట్ పల్లి, అక్టోబర్ 12:** అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తోటి విలేఖరికి మెట్పల్లి ప్రెస్ క్లబ్ ప్రింట్ మీడియా సభ్యులు అండగ నిలిచారు. ఆ విలేఖరికి తమ వంతుగా ఆర్థిక సహాయం అందజేశారు. మెట్పల్లి ప్రెస్ క్లబ్ ప్రింట్ మీడియా ఉపాధ్యక్షుడు జంగం విజయ్ అనారోగ్యం తో నిజామాబాద్ లోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా ప్రెస్ క్లబ్ సభ్యులు సోమవారం ఆసుపత్రికి వెళ్లి విజయ్ ఆరోగ్య పరిస్థితి పై వైద్యులతో మాట్లాడి తెలుసుకొని ఆయన కుటుంబ సభ్యులకు 20 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు భూరం సంజీవ్, జనరల్ సెక్రెటరీ మహమ్మద్ అజీమ్, గౌరవ సలహాదారు దాసం కిషన్, ఉపాధ్యక్షుడు మహ్మద్ అఫ్రోజ్, మాజీ అధ్యక్షుడు ఆగ సురేష్ లు పాల్గొన్నారు.

## హైమాస్ లైట్లు ప్రారంభం..



**చురకలు విలేకరి, మెట్ పల్లి, అక్టోబర్ 12:** పట్టణంలోని 11వ వార్డులో ప్రజల సౌకర్యార్థం తన స్వంత నిధులతో ఏర్పాటు చేసిన రెండు హైమాస్ లైట్లను వార్డు కౌన్సిలర్ రెబ్బాస్ మహేష్ ప్రారంభించారు. రాత్రివేళల్లో వెలుతురు సమస్యను తగ్గించి, ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలనే ఉద్దేశంతో గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద ఒకటి, హనుమాన్ ఆలయం వద్ద మరొక హైమాస్ లైట్ను ఏర్పాటు చేశారు. ఈ లైట్లతో ఆయా ప్రాంతాల్లో రాత్రివేళల్లో వెలుతురు మెరుగుపడి ప్రజలకు సౌకర్యం కలగనుంది. 11 వార్డులోని వెంకటరావుపేటలో మౌలిక సదుపాయాల కల్పనకు చేపడుతున్న చర్యలపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి, వైస్ చైర్మన్ ఓంకార్ నవీన్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు రైసుద్దీన్, ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు మైలారపు రాంబాబు, కాంగ్రెస్ కౌన్సిలర్లు, నాయకులు, ముకీం, కార్యకర్తలు, వీడీసీ సభ్యులు బూరం రాజేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## సత్యసాయి టెంపుల్ ఆధ్వర్యంలో సన్మానం



**చిలకలు ప్రతినిధి కమాన్ పూర్ అక్టోబర్ 12 :** తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ వాసవి సేవ దళ్ ఉపాధ్యక్షులు నియమితులైన అనంతుల రాజు ను శ్రీ సత్యసాయి దేవాలయం ఆధ్వర్యంలో సన్మానించారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సమితి కన్వీనర్ శ్రీనివాసరెడ్డి శాలువాతో సన్మానించి స్వీట్స్ ను పంపిణీ చేశారు రాష్ట్రస్థాయి లో పదవి రావడం గర్వకారణం అన్నారు మరిన్ని సేవలను చేస్తూ ముందుకు సాగాలని కొనియాడారు సత్యసాయి సేవ సంస్థలో సేవలందిస్తూ రాష్ట్రస్థాయిలో సేవా దళ్ ఉపాధ్యక్షులు ఎన్నిక కావడం అభినందనీయమన్నారు ఈ కార్యక్రమంలో సత్యసాయి సేవా సమితి సభ్యులు మల్లయ్య కిష్టయ్య లక్ష్మీనారాయణ మహేందర్ రెడ్డి లక్ష్మణ్ తరుణ్ సరోజన మంజుల శారద పిల్లలు అద్విత్ రామ్ రెడ్డి పాల్గొన్నారు

## పూల సంబురం.. ఆటాపాటల వైభవం

### -పెద్దపల్లిలో ఘనంగా తెలంగాణ జాగృతి బతుకమ్మ వేడుకలు



**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ అక్టోబర్ 12 :** తెలంగాణ అస్తిత్వానికి,సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకైన పూల పండుగ బతుకమ్మ సంబరాలు పెద్దపల్లిలో కన్నులపండువగా సాగాయి.తెలంగాణ జాగృతి జిల్లా అధ్యక్షురాలు మేడారపు రాజ్యలక్ష్మి నేతృత్వంలో నిర్వహించిన ఈ వేడుకల్లో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని సందడి చేశారు.ఈ సంబరాలకు తెలంగాణ జాగృతి రాష్ట్ర అధ్యక్షురాలు మరిపెల్లి మాధవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తీరొక్క పూలతో అందంగా తీర్చిదిద్దిన బతుకమ్మలను మధ్యలో ఉంచి,మహిళలంతా వలయాకారంగా తిరుగుతూ లయబద్ధమైన చప్పట్లతో జానపద పాటలు ఆలపించారు.ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో ఉత్తమంగా నిలిచిన ఐదు బతుకమ్మలను ఎంపిక చేసి,వాటిని రూపొందించిన మహిళలకు నిర్వాహకులు బహుమతులు ప్రదానం చేశారు.ఈ కార్యక్రమంలో జాగృతి జిల్లా మహిళా అధ్యక్షురాలు సుంకరి రజిత,నాయకురాళ్లు సలేంద్ర మమతారాణి, శారద,రోజారమణి,ముస్త్యాల స్వప్న,శ్రీలత, అర్నకొండ సరిత,అర్నకొండ పద్మ,కీర్తి ఉమ,రాజం జ్యోతి,దాసరి అంజలి,ఎండీ గౌస్య బేగం సహా పలువురు మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆర్యవైశ్య సంఘంలో ఘనంగా శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం



**చురకలు ప్రతినిధి నిర్మల్, అక్టోబర్, 12 :** నిర్మల్ పట్టణం లోని బెస్తవారిపేట ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో దుర్గామాత శరన్నవరాత్రి ఉత్సవాలు ఆది వారం ఘనంగా ప్రారంభమ య్యా యి. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వ హించి భక్తిశ్రద్ధలతో పూజించారు. ఉత్సవాల్లో భాగంగా మహిళలు సంప్రదాయబద్ధంగా బతుకమ్మ ఆడి, పాటలు పాడుతూ సందడి చేశారు. భక్తి, ఆధ్యాత్మికతతో పాటు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకలు ఉత్సాహంగా జరిగాయి. అమ్మవారి పూజలు, బతుకమ్మ సంబరాలతో ఆర్యవైశ్య సంఘం ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.

## ప్రముఖ నవలా రచయిత “అంపశయ్య” నవీన్‌తో ఆత్మీయ సాహిత్య సంభాషణ



**చురకలు ప్రతినిధి హుజురాబాద్ అక్టోబర్ 12:** తన తొలి నవల ‘అంపశయ్య’ పేరునే ఇంటిపేరుగా మార్చుకుని, తెలుగు సాహిత్య రంగంలో విశిష్ట గుర్తింపు పొందిన ప్రముఖ నవలా రచయిత అంపశయ్య నవీన్ ను ఆదివారం రాత్రి హన్మకొండలోని ఆయన నివాసంలో హుజురాబాద్ సాహితీ మిత్రులు పాత్రికేయుడు ఆవునూరి సమ్మయ్య, మురికి శివదయాళ్ కలిశారు. ఆయనతో సుమారు గంటన్నరపాటు సాగిన ఆత్మీయ సాహిత్య సంభాషణలో ఎక్కువ సమయం ఆయన రచనలు, వాటి నేపథ్యం, సాహిత్య ప్రస్థానానికి సంబంధించిన విషయాలపైనే చర్చించారు. అంతశయ్య నవీన్ రాసిన నవలలను, ఆయన కథాంశాలను, వైవిధ్యమైన పాత్రలను ఆయన తీర్చిదిద్దిన తీరును వారు ప్రత్యేకంగా అభినందించారు. నవీన్ కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డుతో పాటు, కాళోజి అవార్డును అందుకున్నారని, తెలుగు సాహిత్య అకాడమీకి సలహాదారుడుగా కూడా పనిచేసారని గుర్తు చేశారు. ఆయనతో గత జ్ఞాపకాలు నెమరు వేసుకోవడం సంతోషంగా ఉందన్నారు.

## సద్దుల బతుకమ్మ ఏర్పాట్లను పరిశీలించిన మున్సిపల్ చైర్‌పర్సన్



**చురకలు ప్రతినిధి, హుజురాబాద్ అక్టోబర్ 12:** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సద్దుల బతుకమ్మ వేడుకలను పురస్కరించుకుని హుజురాబాద్ పట్టణంలోని బతుకమ్మ ప్రదేశాల్లో చేపడుతున్న ఏర్పాట్లను మున్సిపల్ చైర్‌పర్సన్ రొంటాల సుహాసిని, మునిసిపల్ కమిషనర్ బి కిషన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, బతుకమ్మ వేడుకలకు వచ్చే మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. బతుకమ్మ ఆడే ప్రదేశాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు, వేడుకలు ముగిసిన అనంతరం పూల బతుకమ్మలను నిమజ్జనం చేసే నీటి ప్రదేశాలను కూడా శుభ్రపరచాలని సూచించారు. మహిళలు సౌకర్యవంతంగా బతుకమ్మ ఆడుకునేందుకు అవసరమైన చోట్ల వీధి దీపాలు ఏర్పాటు చేయాలని, పండుగకు వచ్చే వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు ఏర్పాట్లన్నీ పూర్తి చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బి కిషన్, టౌన్ ప్రెసిడెంట్ తిరుపతి, కౌన్సిలర్లు సునీత బాబు, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, భాస్కర్, పుణ్య బాబు, ఏఈ నరేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ కిరణ్, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ వినయ్, జవాన్లు రాజు, రమేష్‌తో పాటు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

### ఏఎల్పీ గని కార్మికులంతా ఏకమై

## ‘ సింగరేణి కార్మిక గర్జన’ను విజయవంతం చేయాలి



**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ అక్టోబర్ 12.:** సింగరేణి సంస్థ మనుగడను కాపాడుకోవడానికి, కార్మికుల న్యాయమైన హక్కుల సాధనకు ఈ నెల 14వ తేదీన గోదావరిఖని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో సాయంత్రం 5 గంటలకు నిర్వహించే ప్రతిష్టాత్మక ‘సింగరేణి కార్మిక గర్జన’ బహిరంగ సభను కార్మికులంతా ఏకమై విజయ వంతం చేయాలని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం (టీబీజీకేఎస్) కేంద్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఇసంపల్లి రమేష్ పిలుపునిచ్చారు. ఏఎల్పీ గని పిట్ సెక్ర టరీ వి.వి. గౌడ్ అధ్యక్షతన ఆదివారం గని ప్రాంగణంలో విస్తృత స్థాయి గేట్ మీటింగ్ జరిగింది. ఈ సమావేశంలో నాయకులు కార్మికులతో ముఖాముఖి మాట్లాడి, కార్మిక గర్జన సభ ఉద్దేశాలను వివరించారు.

**రూ. 60 వేల కోట్ల బకాయిలు చెల్లించక ఊపిరాడని స్థితిలో సంస్థ**

సమావేశంలో ఇసంపల్లి రమేష్ మాట్లా డుతూ, తెలంగాణ జీవనాడి అయిన సింగరేణి సంస్థను ప్రస్తుత ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చేస్తోందని మండిపడ్డారు. ప్రభుత్వం నుంచి సంస్థకు రావాల్సిన సుమారు రూ. 60,000 కోట్ల బకాయి లను వెంటనే విడుదల చేయకపోవ డంతో సింగరేణి ఆర్థికంగా తీవ్ర ఊపి రాడని స్థితికి నెట్టివేయబడిందన్నారు. దీని ప్రభావం నేరుగా ఉత్పత్తి, కార్మికుల భద్రతపై పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. బొగ్గు వెలికితీతకు అత్యంత కీల కమైన డ్రిల్ బిట్లు, యంత్రాల విడిభా గాలు మాత్రమే కాకుండా, నిత్యం ప్రాణా లను పణంగా పెట్టి పనిచేసే కార్మికులకు కనీస రక్షణ పరికరాలైన సేఫ్టీ షూస్, (పీపీఈ ) కిట్లు కూడా కొనుగోలు చేయలేని దయనీయ స్థితికి యాజ మాన్యం చేరుకుందని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

**పండుగ వచ్చినా లాభాల వాటా ఊసే లేదు**

తెలంగాణ ప్రజలందరికీ ఎంతో పవిత్రమైన బతుకమ్మ, దసరా పండుగలు ప్రారంభమైనప్పటికీ, కార్మికుల రక్తస్వే దంతో వచ్చిన లాభాల వాటా ఊసే ఎత్తకపోవడం శోచనీయమన్నారు. ఎన్నికల్లో గెలిచిన గుర్తింపు సంఘం కార్మికుల పక్షాన నిలబడి ప్రభుత్వంపై ఒత్తిడి తేవడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. కార్మికుల న్యాయబ ద్ధమైన బోనస్, లాభాల వాటాను వెంటనే ప్రకటించి చెల్లించాలని డిమాండ్ చేశారు.

**కారుణ్య నియామకాలపై నీలినీడలు --- మెడికల్ ఇన్వాలిడేషన్లలో కోతలు**

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు ప్రత్యేక పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా అసెంబ్లీలో ఒప్పించి, పోరాడి కారుణ్య నియామకాలను పునరుద్ధరించారని గుర్తుచేశారు. అయితే ప్రస్తుత పాలకులు మెడికల్ బోర్డుల నిర్వహణలో తీవ్ర జాప్యం చేస్తూ, బోర్డులో ఇన్వాలిడేషన్ల సంఖ్యను ఉద్దేశపూర్వకంగా తగ్గించి వేలాది కార్మిక కుటుంబాలకు తీరని అన్యాయం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇచ్చిన హామీ ప్రకారం నెలకు మూడు మెడికల్ బోర్డులు ఏర్పాటు చేసి, దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికీ ఇన్వాలిడేషన్ పూర్తి చేసి వారసులకు ఉద్యోగాలు కల్పించాలని స్పష్టం చేశారు. ప్రధాన డిమాండ్లు:బొగ్గు బ్లాకుల కేటాయింపు: తెలంగాణ పరిధిలోని బొగ్గు బ్లాకులను ఎలాంటి బహిరంగ వేలం, ప్రైవేట్ టెండర్లు లేకుండా నేరుగా సింగరేణి సంస్థకే కేటాయించాలి. ప్రైవేటీకరణ కుట్రల తిప్పిగొట్టడం: కాంగ్రెస్ ప్రభుత్వం పరోక్షంగా సింగరేణిని ప్రైవేటీ కరించేందుకు చేస్తున్న ప్రయత్నాలను కార్మికులంతా ఐక్యంగా తిప్పికొట్టాలి. స్థలం, వడ్డీ లేని రుణం: కార్మికులకు సొంతింటి నిర్మాణానికి 250 గజాల స్థలంతో పాటు, రూ. 20 లక్షల వడ్డీ లేని గృహ రుణం మంజూరు చేయాలి.జీవో 76 అమలు: గత కేసీఆర్ ప్రభుత్వం కార్మికుల సంక్షేమం కోసం తీసుకొచ్చిన జీవో 76ను తూచా తప్పకుండా అమలు చేయాలి.సింగరేణి కార్మిక సంఘాల ఎన్నికలను నిబంధనల ప్రకారం వెంటనే నిర్వహించాలి.ఈ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో తలపెట్టిన ఈ భారీ బహిరంగ సభకు పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షులు కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) ముఖ్య అతిథిగా హాజరై కార్మికులకు దిశానిర్దేశం చేస్తారని తెలిపారు.మాజీ మంత్రులు కొప్పుల ఈశ్వర్, పుట్ట మధూకర్, కోల్ బెల్ట్ ప్రాంత మాజీ శాసనసభ్యులు, టీబీజీకేఎస్ అధ్యక్షులు మిర్యాల రాజిరెడ్డితో పాటు కేంద్ర కమిటీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రసంగిస్తారని వివరించారు.

# 25 ఏళ్ల తర్వాత.. మళ్లీ ఒక్కటైన స్నేహబంధం!



**చురకలు విలేఖరి తిమ్మాపూర్ అక్టోబర్ 12 :** కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని 8వ డివిజన్ జెడ్. పి. హెచ్.ఎస్ అలుగునూర్ పాఠశాల లో 2001--2002 పదవ తరగతి బ్యాచ్ సిల్వర్ జూబ్లీ ఆత్మీయ సమ్మేళనం ఘన జరుపుకోవడం జరిగింది. అలుగునూర్ జెడ్.పి. హెచ్. ఎస్ పాఠశాలలో 2001--2002 విద్యా సంవత్సరంలో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థుల సిల్వర్ జూబ్లీ గెట్ టుగెదర్ కార్యక్రమం ఎస్.వి.ఎస్ బాంక్వెట్ హాల్‌లో ఎంతో ఘనంగా, ఉత్సాహభరితంగా జరిగింది. పాతికేళ్ల తర్వాత కలుసుకున్న స్నేహితులు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ, పాఠశాల రోజుల మధుర జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. చిన్ననాటి అల్లరి, తరగతి గది సరదాలు, గురువులతో గడిపిన అమూల్యమైన క్షణాలను గుర్తుచేసుకుంటూ ఆనందంగా గడిపారు.కాలం మారినా.. జీవితాలు మారినా.. వృత్తులు, బాధ్యతలు పెరిగినా.. ఆనాటి స్నేహబంధం మాత్రం చెక్కుచెదరలేదని ఈ ఆత్మీయ సమ్మేళనం మరోసారి నిరూపించింది.వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులంతా ఒకే వేదికపై కలుసుకోవడం, తమ అనుభవాలను పంచుకోవడం, నవ్వులు పంచుకోవడం ఈ వేడుకకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఎన్నో మధుర జ్ఞాపకాలను మిగిల్చిన ఈ వేడుక ప్రతి ఒక్కరి మనసులో చిరస్థాయిగా నిలిచిపోనుంది. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులకు పాఠాలు బోధించిన గురువులు రఘు శంకర్ రెడ్డి, రాజిరెడ్డి, మునయ్య, సత్యనారాయణ , ఏనుగు మల్లారెడ్డి, గంగాధర్ రెడ్డి, రమాదేవి, భూలక్ష్మి మరియు పూర్వ విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# మేజిక్ రాజాకు టీపీఏ సత్కారం




**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ అక్టోబర్ 12.:** స్థానిక ప్రముఖ కళాకారుడు, మోటివేషనల్ స్పీకర్ మేజిక్ రాజాను తెలంగాణ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ (టీపీఏ) మంచిర్యాల జిల్లా శాఖ ఆధ్వర్యంలో సోమవారం శాలువాతో ఆత్మీయంగా సత్కరించి జ్ఞాపికను అందజేశారు. విద్యార్థులకు స్ఫూర్తిదాయక ఉపన్యాసాలతో ప్రేరణ కల్పిస్తున్న ఆయన సేవలను గుర్తించి ఈ సత్కారం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం-2026 సందర్భంగా మంచిర్యాల జిల్లా కేంద్రంలోని కాలేజ్ రోడ్డులో పద్మనాయక ఏసీ హాల్‌లో కృష్ణవేణి ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సహకారంతో కొక్కిరాల రఘుపతిరావు చారిటబుల్ ట్రస్ట్ నిర్వహిస్తున్న ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థులకు నిర్వహిస్తున్న పోటీ పరీక్షల శిక్షణ శిబిరంలో జరిగిన కార్యక్రమానికి టీపీఏ వ్యవస్థాపకుడు, రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మోతుకూరి రాంచందర్ ముఖ్య అతిథిగా హాజరై, శిక్షణార్థులకు మానసిక ఆరోగ్యం ప్రాధాన్యం, పరీక్షల ఒత్తిడిని ఎదుర్కొనే విధానాలు, భావోద్వేగ సమతుల్యత, ఆత్మవిశ్వాసం పెంపొందించుకోవడంపై అవగాహన కల్పించారు. అనంతరం మేజిక్ రాజా ప్రదర్శించిన మాట్లాడే బొమ్మ శిక్షణార్థులను అలరించింది. టీపీఏ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు రంగు వేణు కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి సుమన చైతన్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.నారాయణరావు, టీపీఏ సలహాదారు, కృష్ణవేణి ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ అధినేత కస్తూరి పద్మ చరణ్, గుండేటి యోగేశ్వర్, విన్నర్ ఐకాన్ కాంపిటేటివ్ ఇన్‌స్టిట్యూట్ అధినేత నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# పోలీసు కమిషనర్‌ను కలిసిన ఎంఐఎం నాయకులు



**కరీంనగర్, అక్టోబర్ 12:-** ఎంఐఎం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా ఎంఐఎం నాయకులు, జిల్లా పోలీసు కమిషనర్ గౌస్ ఆలం ను పోలీస్ కమిషనరేట్ లో మర్యాద పూర్వకంగా కలిశారు. గులాం అహ్మద్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడుగా ఎన్నికైన తర్వాత ఉమ్మడి జిల్లా నాయకులతో కలిసి, మొదటగా కరీంనగర్ జిల్లా పోలీసు కమిషనర్ ను కలవడం పార్టీలో ప్రాధాన్యత సంతరించుకుంది. ఈసందర్భంగా గులాం అహ్మద్ హుస్సేన్ మాట్లాడుతూ కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణ కోసం, తమ వంతుగా పోలీసు శాఖకు సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు. ఈకార్యక్రమంలో ఎంఐఎం నాయకులు హాఫిజ్ సయ్యద్ మొయిజుద్దీన్ ఖాద్రి, మాజీ కార్పొరేటర్లు ఆరిఫ్ అహ్మద్, లింగపల్లి శ్రీనివాస్, అహ్మద్ మొహియుద్దీన్ బాబుజానీ, ఎంఏ సలీం, అబ్దుల్ గఫ్ఫార్, వాజిద్ అలీఖాన్, ఖాజా మజారోద్దీన్, సాజిద్, అక్బర్ అలీ, సురేశ్, గాలి రాజు, ఇంతియాజ్, జుబేర్ ఖురేషీ, షాకిర్ నహ్డా, పెద్దపల్లి నాయకులు ఇమ్రాన్ వకీల్, ఉమేర్, కోరుట్ల నాయకులు హాఫిజ్ ఖురేషీ, రహీం, వాజిద్, నిజాం, సిరిసిల్ల నాయకులు ముస్తఫా, పర్వేజ్, అహ్మద్ ఖాన్, నయిమోద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# చిట్టి డబ్బులు ఇప్పించాలని బాధితులు వేడుకోలు



**వీణవంక:** కరీంనగర్ జిల్లా వీణవంక మండలం కోర్కల్ గ్రామంలో చిట్టీల వ్యాపారి మృతిచెందడంతో బాధితులు లబోదిబోమంటున్నారు. చిట్టీల వ్యాపారం నడిపించి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. అంత్యక్రియల తర్వాత డబ్బులు చెల్లిస్తామని చెప్పిన కుటుంబ సభ్యులు.. ఇప్పుడు కోర్టు నోటీసులు తో పాటు కోర్టు లో చూసుకుందాం అని దాటవేస్తున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.కష్టపడి దాచుకున్న సొమ్మును తమకు ఇప్పించి న్యాయం చేయాలని అధికారులుకు బాధితులు వేడున్నారు.

## నాయకపోడ్ సేవా సంఘం జిల్లా అధ్యక్షుడిగా కొలకాని సమ్మయ్య



**చురకలు ప్రతినిధి మంథని, అక్టోబర్ 11:** తెలంగాణ రాష్ట్ర నాయకపోడ్ సేవా సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడిగా భటుపల్లి గ్రామానికి చెందిన కొలకాని సమ్మయ్యను సోమవారం నియమించారు. మంథని మండలం బట్టుపల్లి గ్రామానికి చెందిన కొలకాని సమ్మయ్యను రెండు సంవత్సరాల కాలానికి మంథని మండల అధ్యక్షులు గా నియమిస్తూ రాష్ట్ర కమిటీ నియామక పత్రాన్ని అందజేసింది. రాష్ట్ర అధ్యక్షులు మెసినేని రాజయ్య, కార్యనిర్వాహక అధ్యక్షులు గాండ్ల రామచందర్, పోలం మల్లేష్ ఆధ్వర్యంలో ఈ నియామకం జరిగింది. ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన సమ్మయ్య మాట్లాడుతూ.. నాయకపోడ్ కుటుంబ జాతి అభివృద్ధి కోసం కృషి చేస్తానని, సంఘ నియమాలకు కట్టుబడి నిస్వార్థంగా పనిచేస్తానని ప్రతిజ్ఞ చేశారు. సమ్మయ్య నియామకం పట్ల మాజీ సర్పంచ్ బందెలు లక్ష్మణ్, బట్టుపల్లి గ్రామస్తులు హర్షణ వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు పాల్గొన్నారు.

## తహసీల్దార్, ఆర్ఐలపై కలెక్టర్, పోలీసులకు రైతు ఫిర్యాదు



**చురకలు విలేఖరి, వీణవంక, అక్టోబర్ 12:** ముందస్తు నోటీసులు లేకుండా తన సొంత పట్టా భూమిలోకి అక్రమంగా ప్రవేశించి,పీడీ యాక్ట్ కింద జైలుకు పంపుతామని బెదిరించిన రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలని కొత్తపల్లి (రెడ్డిపల్లి) గ్రామానికి చెందిన రైతు గుంటి రవీందర్ , తన భార్య స్వరూప తో కలిసి ప్రజావాణిలో జిల్లా కలెక్టర్ ఫిర్యాదు చేశారు. అలాగే వీణవంక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. పోచమ్మ దేవాలయం భూమి ఆక్రమించారని,?అదే గ్రామానికి చెందిన కొందరు స్వార్థ ప్రయోజనాల కోసం తప్పుడు ఫిర్యాదు చేశారని తెలిపారు. దీని ఆధారంగా ల్యాండ్ సర్వే చేయకుండానే తహసీల్దార్, ఆర్ఐ లు తన భూమిలోకి చొరబడి, అక్రమ కేసులు బనాయిస్తామని బెదిరించారని వాపోయారు. తన భూమిని సర్వే చేసి హద్దులు చూపాలని, బెదిరింపులకు పాల్పడిన అధికారులతో పాటు తన తప్పుడు ఫిర్యాదు చేసిన పై సమగ్ర విచారణ జరిపి న్యాయం చేయాలని ఆయన వేడుకున్నారు.

## మంథని నూతన డిపో మేనేజర్‌గా జ్ఞానేశ్వర్ బాధ్యతల స్వీకరణ



**చురకలు ప్రతినిధి మంథని, అక్టోబర్ 12:** మంథని ఆర్టీసీ డిపో నూతన మేనేజర్ గా జ్ఞానేశ్వర్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా సోమవారం డిపో ఆవరణలో ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. ఎంప్లాయిస్ యూనియన్ డిపో కార్యదర్శి గంధం రమేష్ ఆధ్వర్యంలో ఎస్ టీ ఐ , ఆఫీస్ సిబ్బంది, గ్యారేజ్ సిబ్బంది, ఏ ఎం ఎఫ్ సార్ లు కలిసి జ్ఞానేశ్వర్ సార్ ను పూలమాలలు, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నూతన డిపో మేనేజర్ జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ.. డిపో అభివృద్ధికి, ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడానికి అందరి సహకారంతో కృషి చేస్తానని తెలిపారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడానికి ప్రాధాన్యత ఇస్తానని హామీ ఇచ్చారు.

## ఓటు హక్కును కాపాడాలి : కేకే మహేందర్ రెడ్డి



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట అక్టోబర్ 12:** రాజన్న సిరిసిల్ల: ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ వ్యవహారశైలిపై తలెత్తుతున్న ప్రశ్నలకు కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలని కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. సామాన్య ప్రజల ఓటు హక్కును కాపాడాలని కోరుతూ సిరిసిల్ల నియోజకవర్గంలో దాదాపు 300 ద్విచక్ర వాహనాలతో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అర్హులైన ప్రతి పౌరుడి ఓటు హక్కును పరిరక్షించడం ప్రజాస్వామ్య వ్యవస్థ బాధ్యతని అన్నారు. ఎన్నికల వ్యవస్థపై ప్రజలకు పూర్తి విశ్వాసం కలిగేలా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరించాలని కోరారు. అనంతరం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, మహాత్మా గాంధీ విగ్రహాలకు వినతిపత్రాలు సమర్పించి, శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

### జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్

**చురకలు ప్రతినిధి, జగిత్యాల, అక్టోబర్ 12:** ప్రజావాణి ద్వారా ప్రజల నుండి అందుతున్న ఫిర్యాదులు, వినతులపై సమగ్ర విచారణ జరిపి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ప్రజల నుండి ఫిర్యాదులు, వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంతో పాటు వివిధ మండలాల నుండి ప్రజలు తమ సమస్యల



పరిష్కారం కోసం ప్రజావాణి కార్యక్రమానికి వస్తున్నారని తెలిపారు. ప్రజల నుండి అందుతున్న ప్రతి ఫిర్యాదును అధికారులు బాధ్యతాయుతంగా తీసుకొని, సంబంధిత సమస్యపై సమగ్ర విచారణ జరిపి సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజావాణి ద్వారా అందిన అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిశీలించి, నిర్ణీత సమయంలో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం లేకుండా ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రజావాణి కార్యక్రమానికి 49 ఫిర్యాదులు, వినతులు అందాయని, వాటిని సంబంధిత శాఖల అధికారులు పరిశీలించి తగిన చర్యలు తీసుకొని పరిష్కరించాలని సూచించారు. ప్రజావాణి ద్వారా అందిన ప్రతి దరఖాస్తును అధికారులు ప్రాధాన్యతతో పరిశీలించి, సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టడంతో పాటు దరఖాస్తుదారులకు తగిన సమాచారం అందించాలని పేర్కొన్నారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు సకాలంలో అందే విధంగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌ఓ కె. వై ప్రసాద్, ఆర్డీవో లు మధు సూదన్, జీవాకర్ రెడ్డి, నరసింహ రావు, జిల్లా అధికారులు, వివిధ శాఖల అధికారులు, మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

## బాధితుల సమస్యలకు తక్షణ పరిష్కారానికి చర్యలు

### జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, అక్టోబర్ 12 :** బాధితుల సమస్యలకు తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకుంటూన్నామని జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ అన్నారు. ప్రతి సోమవారం ప్రజల సౌకర్యార్థం నిర్వహించే గ్రీవెన్స్ డే లో భాగంగా జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 14 మంది అర్జీదారులతో నేరుగా మాట్లాడి తమ సమస్యలను తెలుసుకొని సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడి పూర్తి వివరాలు సమర్పించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ అశోక్ కుమార్ మాట్లాడుతూ ప్రజలకు పోలీస్ శాఖను మరింత చేరువ చేయడం లక్ష్యంగా ప్రజా సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తున్నామన్నారు. బాధితుల సమస్యలు తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని, పోలీస్ స్టేషన్ కు వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి వినతులు స్వీకరించి సంబంధిత ఫిర్యాదులపై క్షేత్ర స్థాయిలో పరిశీలించి వేగంగా స్పందించి చట్టపరంగా బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలని, ఫిర్యాదుదారునికి భరోసా, నమ్మకం కలిగించాలన్నారు. బాధితుల యొక్క ప్రతి ఫిర్యాదును ఆన్ లైన్ లో పొందుపరుస్తూ నిత్యం పర్యవేక్షణ చేస్తున్నట్లు తెలిపారు.

## ప్రజావాణిలో ప్రజల ఫిర్యాదులు స్వీకరించిన నిర్మల్ ఎస్పీ

**చురకలు ప్రతినిధి నిర్మల్, అక్టోబర్, 12 :** నిర్మల్ జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా ఎస్పీ జానకి షర్మిల జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతులను స్వీకరించి, వారి సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఫిర్యాదుదారులు తెలిపిన సమస్యలను ఎస్పీ క్షుణ్ణంగా విని, సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులతో మాట్లాడి, ప్రతి ఫిర్యాదుపై తక్షణమే స్పందించాలని ఆదేశించారు. ఫిర్యాదులను చట్టప్రకారం సమగ్రంగా పరిశీలించి, బాధితులకు సకాలంలో న్యాయం జరిగేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజావాణిలో అందిన ప్రతి ఫిర్యాదును బాధ్యతాయుతంగా పరిగణించి, వాటి పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలను ఎప్పటికప్పుడు సమీక్షించాలని




అధికారులను ఆదేశించారు. సమస్యల పరిష్కారంలో అనవసర జాప్యాన్ని నివారిస్తూ, ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించి, వారికి అవసరమైన సహకారం అందించాలని స్పష్టం చేశారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా పోలీసు శాఖ దృష్టికి తీసుకువచ్చేందుకు ప్రజావాణి కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందని ఎస్పీ పేర్కొన్నారు. ప్రజలకు పోలీసు సేవలను మరింత చేరువ చేయడం, పారదర్శకంగా, బాధ్యతాయుతంగా సేవలందించడం ద్వారా పోలీసు శాఖపై ప్రజల్లో నమ్మకాన్ని మరింత బలోపేతం చేయడమే లక్ష్యమని జిల్లా ఎస్పీ.జానకి షర్మిల తెలిపారు.

# గులాబీమయమైన జగిత్యాల

### ఘనంగా జగిత్యాల జిల్లా ఏర్పాటు దశాబ్ది ఉత్సవాలు



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, అక్టోబర్ 12:** జగిత్యాల జిల్లా ఏర్పాటు దశాబ్ది ఉత్సవాలను జగిత్యాల జిల్లా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా నలుమూలల నుండి వేలాది మంది బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావడంతో జగిత్యాల పట్టణం గులాబీమయమైంది. డీజే పాటలకు నృత్యాలు, జై కేసీఆర్, జై తెలంగాణ నినాదాలతో పట్టణం మార్మోగింది. జిల్లా అధ్యక్షులు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్ రెడ్డి, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, తొలి జెడ్పీ చైర్ పర్సన్ దావా వసంత సురేష్, మాజీ ఎమ్మెల్యే సుంకే రవిశంకర్, నాయకులు లోక బాపురెడ్డి, చల్మెడ లక్ష్మీనరసింహారావు, తదితరులు హాజరయ్యారు. కొత్త బస్టాండ్ వద్ద తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేసి, క్షీరాభిషేకం చేసి ఉత్సవాలు ప్రారంభించారు. అనంతరం పాత బస్టాండ్ వద్ద కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి, అక్కడి నుండి అంగడి బజార్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. దారిలో తహసీల్ చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహానికి, అంగడి బజార్ లో కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి నివాళులు అర్పించారు. అనంతరం జరిగిన సభలో తెలంగాణ అమరవీరులకు మౌనం పాటించి నివాళులర్పించి, ఉద్యమకారులను సన్మానించారు. మాజీ మంత్రి జీవన్ రెడ్డి మాట్లాడుతూ10 జిల్లాలను 33 జిల్లాలుగా చేసి పరిపాలనను ప్రజలకు చేరువ చేసిన ఘనత కేసీఆర్ దే అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం హామీలతో అధికారంలోకి వచ్చి ప్రజలను మోసం చేస్తోందని, రేవంత్ పాలనలో సాగునీరు, కరెంటు లేదని, తుమ్మిడిహెట్టి పనులు మూడేళ్లయినా ముందుకు సాగలేదని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టు కరువులో ఆదుకునేందుకు కేసీఆర్ కట్టారని, యాదాద్రి పవర్ ప్లాంట్ కు బొగ్గు సరఫరా చేయలేక విద్యుత్ కొరత సృష్టిస్తున్నారని ఆరోపించారు. జగిత్యాల మెడికల్ కళాశాల భవనాన్ని కావాలనే పూర్తి చేయడం లేదని మండిపడ్డారు. మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ ప్రజల కష్టాలు తెలిసిన నాయకుడు కేసీఆర్ అని, 46 వేల చెరువులు మరమ్మతు, 7 వేల నుండి 20 వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి, 273 కోట్ల మొక్కలు నాటారని గుర్తు చేశారు. రేవంత్ పాలనలో 4 వేల ప్రభుత్వ పాఠశాలలు మూసివేశారని, బెల్టు షాపులతో ఎక్సైజ్ ఆదాయాన్ని 23 వేల కోట్ల నుండి 40 వేల కోట్లకు పెంచారని విమర్శించారు. జిల్లా అధ్యక్షులు విద్యాసాగర్ రావు మాట్లాడుతూ కేసీఆర్ స్ఫూర్తితో ఇతర రాష్ట్రాలు కూడా కొత్త జిల్లాలు ఏర్పాటు చేశాయని, కాంగ్రెస్ ప్రభుత్వం మెడికల్ కళాశాలకు నిధులు ఇవ్వడం లేదని, గతంలో కేసీఆర్ మంజూరు చేసిన అర్బన్ డెవలప్మెంట్ నిధులతోనే ఇప్పుడు పనులు చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, ప్యాక్స్ చైర్మన్లు, మండల అధ్యక్షులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మహమ్మద్ ఉస్మాన్ పాషా

**చురకలు ప్రతినిధి హుజురాబాద్ అక్టోబర్ 12:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మహమ్మద్ ఉస్మాన్ పాషా ఎన్నికయ్యారు. ఉస్మాన్ పాషా సుదీర్ఘ కాలం ఉపాధ్యాయునిగా పనిచేశారు. అలాగే పంచాయతీరాజ్ ఉపాధ్యాయుల అసోసియేషన్‌లో వివిధ హోదాల్లో సేవలు అందించారు. అలాగే టీఎన్జీవో సంఘంలోనూ కీలక భూమిక పోషించారు. ఉద్యోగ ఉపాధ్యాయ కార్మిక వర్గాలతో ఆయనకు మంచి సంబంధాలు ఉన్నాయి. ఆయన కుటుంబ సభ్యులు బంధువులు కూడా ప్రభుత్వ ఉద్యోగాల్లో వివిధ స్థాయిల్లో పనిచేస్తున్నారు. ఉస్మాన్ పాషా తండ్రి దివంగత రాజమహమ్మద్ గతంలో హుజురాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ గా సేవలందించారు.